


# ప్రైవేటు

రచన: "నాగమణి"

"ఒరేయ్! కాఫీ ఐంది లేవరా" అంది మహలక్షమ్మ.

"ఉండవే ఈ రోజైనా బాగా నిద్ర పోనియ్" అన్నాడు వెంకట్రావు దుప్పటి ముసుగు తియ్యకుండానే. మహలక్షమ్మ మాట్లాడకుండా వెళిపోయింది. వెంకట్రావుకు నిద్రపట్టలేదు కిటికీనుండి దుప్పటిమీద సూర్యకిరణాలు వెచ్చగా తగుల్తున్నా యతనికి. పరీక్షలు నిన్నటితో అఖరైనాయి. అన్నీ బాగానే వ్రాశాడు తను. తప్పక ప్యాసవుతాడు.

దుప్పటి విసరేసి నేరుగా దొడ్లోకి వెళ్ళాడు. మహలక్షమ్మ అంట్లు తోముతున్నది. పక్కనే వెళ్లి కూర్చున్నాడు వెంకట్రావు. 'ఏమిరా' అంది.

"అమ్మా, మరి కాలేజీ చేరతానే" అన్నాడు.

తోముతున్న చెంబు వదలిపెట్టి కొడుకు కండ్లలోకి దీర్ఘంగాచూచి నవ్వింది. వెంకట్రావు ఏమీ అర్థంకానట్లు చూచాడు. 'ఇది ప్యాసవనీ? నిన్న పరీక్షలైనాయో లేదో అప్పుడే కాలేజిచేంతావెమిట్రా? ముందు పళ్లుతోముకొని కాఫీ తీసుకో. చల్లారిపోతాయి' అంది. వెంకట్రావు బుద్ధిమంతునిలా లేచివెళ్ళాడు.

కాఫీ త్రాగి టేబుల్ ముందు కూర్చున్నాడు. 'గలివర్ ట్రావెల్స్' పుస్తకం క్రింద పడివుంది. పరీక్షలైన తర్వాత మరొకసారి చదవాలనుకొన్నాడు ఆ పుస్తకాన్ని. పుస్తకం నుండి రెండు మూడు పేజీలు తిరగవేశాడు, విసుగు పుట్టింది. పుస్తకం మడిచిపెట్టి ఆలోచించసాగాడు. నిన్నటివరకు తప్పక చదువుదామనుకున్నది ఈ రోజుకు రుచించలేదు. ఎందువల్ల? ఈ ఒక్క రోజుకే ఏమీ తోచటంలేదు. మరి మూడు నెలలు సాగేదెట్లా? అవును, ఏదో ఒక వ్యాపకం వుండాలి. ఉద్యోగాలు యిప్పట్లో తనకు దొరకవు. ఇక తాను చేసేదేమిటి? అమ్మ వండిపెట్టె తింటూ ఛఛ. శర్మదగ్గరకుపోతే ఏమైనా చెప్తాడు అనుకుని చొక్కా తొడుక్కొని 'అమ్మా శర్మదగ్గరికి పోయివస్తాను' అని కేకవేసి వీధిలో పడ్డాడు,

"వెంకట్రావు వెళ్ళేసరికి శర్మ ఏదో నవల చదువుకుంటున్నాడు. 'ఏరా, అప్పుడే ఏదో సమస్యను తెచ్చావే' అన్నాడు శర్మ వెంకట్రావును చూడగానే.

"అవున్రా. యీ మూడునెలలుగడిచేదెలాగ? యీ ఒక్కరోజుకే ఏదో యుగం గడిచినట్టుంది" అన్నాడు.

"ఒరేయ్. నీకు యిల్లువుందికదూ?"

"ఆఁ వుంది."

"తిండికి గింజలు పొలాన్నుంచి వస్తాయిగదూ?"

"అవును."

"మీ ఇంటిపైవచ్చే అద్దె పైఖర్చులకు సరిపోతుందికదూ?"

"ఆఁ"

"అంతే" అన్నాడు శర్మ.

"అంటే?"

"ఒరెయ్. నీకు తిండిగుడ్డలకు లోటు లేదుకదా. హాయిగా లైబ్రరిలోంచి నవలలు తెచ్చుకొని చదువు. అంతేనాన్నా నువ్వు చెయ్యాల్సింది"

"ఏడ్చినట్టుంది."

"అలా ఐతే ఏమైనా పనిచేస్తావా?"

"ఆదేరా. ఎలాటిపనో నువ్వుచెప్తే."

"ఆలోచించాలి. రేపుకనబడు. అన్నీ సంగతులు చెప్పేస్తా"

"సరే. అయితే వెళ్తా"

"ఒరే వుండరా. నాలుగు ఆటలు 'చెస్' ఆడిపోదువుగాని" అన్నాడు శర్మ. వెంకట్రావు ఆ రోజు మధ్యాహ్నం ఒంటిగంటకు యిల్లు చేరుకున్నాడు.

*   *   *

వారంరోజులు గడిచాయి. ఇప్పుడు వెంకట్రావు ఆరుమంది పిల్లలకి ప్రైవేటు చెప్తున్నాడు. ఇక మూడుమాసాలకు ముగ్గుర్ని ఫస్టుఫారంలోనూ, మరో ముగ్గుర్ని రెండోతరగతిలోను చేర్చాలి. ఆరుమందీ కలిసి నెలకు ముప్పైరూపాయలిస్తారు. ప్రొద్దున్నే ఏడుగంటలకు వెళ్తాడు. ఆరుమంది ఒకేయింటిలో చేరుతారు. వాళ్లకు ట్యూషనుచెప్పి ఏ పదికో, పదకొండుకో యింటికి వస్తాడు, ముందు మహలక్షమ్మ యిందుకు ఒప్పుకోకపోయినా కొడుకు పట్టుపట్టడంవల్ల ఊరుకుంది, సాయంత్రంకూడా మరెవరైనా ట్యూషనుకు కుదిర్తే బాగుండు ననుకున్నాడు. అతనికి బాగా పొద్దుపోతున్నదిప్పుడు.

పదిన్నర గంటలకు ప్రైవేటు ముగించి లేచాడు. పిల్లలుకూడా వెళ్లిపోవడానికి సిద్ధమయ్యారు రెండో తరగతి చేరాల్సిన వనజ వెంకట్రావును భయంగా చూస్తూ నిల్చుంది. 'ఏం కావాలి?' అన్నాడు వెంకట్రావు.

"మరేనండీ మాష్టారూ. మాయింటికి మూడిళ్లవతల రవణమ్మగారు మిమ్మల్ని రమ్మన్నారండీ."

"ఎందుకు?"

"ఏమోనండి మేష్టారూ."

"సరే, సాయంత్రం వెళ్తాలే". అన్నాడు. పిల్లలంతా వెళ్లిపోయారు. వెంకట్రావు ఆ రోజు సాయంత్రం రవణమ్మగారింటి కెళ్ళాడు.

రవణమ్మకు సుమారు యాభై ఏళ్లుంటాయి. కాని అలంకరణవల్ల నలభైయేళ్ళలోపు మనిషిలాగు కన్పిస్తుంది. వెంకట్రావు గుమ్మంలో అడుగు పెడ్తూనే కమ్మని సన్నజాజుల పరిమళం పీల్చాడు. వాకిట్లోనే చిన్న పందిరివుంది.

"అబ్బాయ్, లోపలికిరా" అన్నది రమణమ్మ.

"పిల్చారట" అన్నాడు వెంకట్రావు.

"ఆఁ, కూర్చో" అని కుర్చీ చూపించింది. వెంకట్రావు కుర్చీలో కూలబడ్డాడు. 'మా అమ్మాయికి ప్రైవేటు చెప్తావా?' అన్నది. ఓహో, ఇందుకేనా?

ప్రైవేటుమాస్టారుగా తనకు సంఘంలో ఒక స్థానం వచ్చింది అనుకున్నాడు. 'ఏమంటావబ్బాయ్' అంది మళ్లీ రమణమ్మ.

"అలాగేనండి. అమ్మాయిని ఏ క్లాసులో చేర్చాలి?"

"ఏక్లాసులోనూ అక్కరలేదు. ఇంగ్లీషుమాత్రం చిన్నచిన్న పుస్తకాలు చదివి అర్థంచేసుకోగలంతవరకు చెప్పు"

"ఇంతకుముందు ఏక్లాసువరకు చదివింది?"

"సెకండ్‌ఫారం నీకు జీతం పదిహేనురూపాయలిస్తాం. సరేనా?"

పదిహేనురూపాయలే! అనుకున్నాడు. సరేనన్నాడు.

"రేపట్నుంచి సాయంకాలం ఐదు గంటలకురా. ఒకగంటచెప్తే చాలు. ఇంద అడ్వాన్సుగా ఈ పదిరూపాయలు తీసుకో"

"అలాగేనండి, రేపట్నుంచి వస్తానండి" అని పైకంతీసుకొని వెళ్ళిపోయాడు. షికారుకు పోకుండా యింటిదారిపట్టాడు. కొడుకు మరొక ట్యూషను సంపాదించాడని మహలక్షమ్మ సంతోషించింది.

మర్నాడు సాయంత్రం సరిగా ఐదు గంటలకు రవణమ్మగారింటికి వెళ్ళాడు వెంకట్రావు. గేటుతలుపులు తీసేవుంది, సన్నజాజుల పరిమళం పీలుస్తూ పందిరి వద్ద నిల్చునే 'ఏమండీ' అన్నాడు. 'ఎవరు' అంటూ ఒక పదహారేళ్ళ అందమైన కన్య బయటికివచ్చింది. 'ఓ. మేష్టారుగారా, లోపలికిరండి' అంది.

వెంకట్రావు బిత్తరపోయాడు. తన శిష్యురాలు ఏ పదేళ్ల అమ్మాయో ఐ వుంటుందనుకున్నాడు. కాని ఇంతపెద్ద అమ్మాయని; అందానికి తానే నిర్వచనం ఐ వుంటుందని అనుకోలేదు. కలగంటున్నట్లు ఫీలయ్యాడు. ఆమె వెంటనే లోనికివెళ్లాడు.

అదొక చిన్నహాలు. ఒకవేపుగా పట్టె మంచం వుంది. రాధాకృష్ణుల క్యాలెండర్లు కళాత్మకంగా వ్రేలాడదీయబడి వున్నాయి. మంచానికి ప్రక్కగా గోడవారన టేబులు, కుర్చీ వున్నాయి. పైన దూలానికి బార్‌లైటు వుంది. కిటికీలోంచి దొడ్లోని బాదంచెట్టు, చిన్న బావి కనబడ్తున్నాయి. టేబులుపైన ఏవేవో పుస్తకాలున్నాయి.

"రండి మేష్టారూ" అంది చాపొకటి పరుస్తూ. టేబులుమీదున్న పుస్తకాలు తెచ్చి చాపపై పడవేసి, బుద్ధిమంతురాలిలా కూచుంది. మేష్టారుగుండె దడదడమని కొట్టుకుంది. వెళ్లి తానుగూడ చాపపై కూర్చున్నాడు. నోరు పెగలలేదతనికి. 'మంచినీళ్లు' అన్నాడు. ఇరవై సెకండ్లు గడిచాయి. 'ఇదిగోనండి



మేష్టారూ' అంది. గ్లాసెడునీళ్ళు ఒక్క గుక్కలో తాగేశాడు. 'రవణమ్మగారేరీ?' అన్నాడు.

"గుళ్ళోకి వెళ్ళింది ఐతే నాకు పాఠం చెప్పరా" అంది. ఈ లోకంలో పడ్డాడు వెంకట్రావు.

"అఁ చెప్తానండి. ఏవీ పుస్తకాలివ్వండి" అన్నాడు,

'మాష్టారూ! నాపేరు రాధ. నన్ను పేరుతోనే పిలవండి"

"రాధ" అన్నాడు ఆమె మొహంలోకిచూస్తూ. గుండ్రటి మొహం. చిన్న సన్నటి ముక్కు. మరీ చిన్న పెదాలు, రింగులుతిరిగిన జుట్టు చెంపలమీద పడ్తున్నది. వయ్యారంగా వాటిని సర్దుతూంది. ఎర్రరేపు జాకెట్టు, పరికిణీ తొడుక్కొని నీలంరంగు పమిటవేసుకొంది. తల్లోని సన్నజాజులు చక్కటి పరిమళం వెదజల్లుతున్నాయి.

"పుస్తకం యిలాయియ్యి" అన్నాడు కొంతసేపటికి.

రాధ తనచేయి అతనికి తగిలేలా యిచ్చింది. పుస్తకం చూడకుండానే 'ఏక్లాసుదాకా చదివావు?' అన్నాడు.

"సెకండ్‌ఫారం" అంది అతని కండ్లలోకిచూస్తూ.

"ఆహా. అలాగా" అని పుస్తకం తెరిచాడు. 'కళాశాస్త్రము అని వ్రాసివుంది. పేజీలు తిరగవేశాడు. ఏవేవో పద్యాలు, బూతుబొమ్మలు వున్నాయి దాంట్లో. పుస్తకం కిందపెట్టి లేచి నిల్చున్నాడు. రాధ అతని చేయిపట్టుకొని ఆపింది. వెంకట్రావు రాధవైపు చూచాడు: దీనం

గా. కూర్చోమని చెప్తున్నాయి రాధ చూపులు. వెంకట్రావు చెయ్యి విడిల్చుకోబోయి ఆగాడు. నెమ్మదిగా కూర్చున్నాడు. రాధ మొహానికి దగ్గరగావచ్చి 'రాధా! మీ అమ్మ వస్తే?' అన్నాడు మెల్లగా.

రాధ కళ్లు తాటించి నవ్వింది. 'రాదు. సినిమాకెళ్లింది.'

"ఐతే గుళ్ళోకెళ్ళిందన్నావు?"

"అమాటంటే మీరు వెళ్లిపోతారని"

"ఐనా ఇదా ప్రైవేటు రాధా. మీ అమ్మకు ఎలాగో తెలుస్తుంది. అప్పడెలాగూ......"

"సరే. మీచేత ప్రైవేటు చెప్పించుకుంటాను, రండి. ముందు మంచం మీద కూచోండి" అంటూ చేయిపట్టుకొని తీసుకెళ్లింది. వెంకట్రావు మంచం మీద కూర్చున్నాడు. రాధ గబగబావెళ్లి గేటుతలుపులు వేసింది. లోపలికివచ్చి హాలుగుమ్మం మూసేసింది. బారులైట్ స్విచ్ నొక్కింది. హాలంతా వెలుగుతో నిండిపోయింది. వెంకట్రావు తన మెదడును స్వాధీనంలోకి తెచ్చుకోలేక పోయాడు. జరుగుతున్నది కళగా భావిస్తూ చూస్తున్నాడు. రాధ మంచం మీదికి చేరుకుంది. వెంకట్రావులో చలనంలేదు. 'ఏమండీ, మమ్మల్నేనండి' అంది భుజాలుపట్టుకొనివూపుతూ.

"ఆఁ ఆఁ" అన్నాడు అచలనంలేని స్థితిలో.

"ఇక చెప్పండి ప్రైవేటు" అని అతని వక్షానికి తల ఆనించింది. సన్నజాజుల పరిమళం గుప్పుమంది కలలోని వెంకట్రావు వాస్తవంలోకి వచ్చాడు ఉన్మాది ఐనాడు. రాధమొహం పైకెత్తి చుంబించాడు. అంతే రాధను మంచంమీదికి నెట్టివేసి తానుగూడ ఒకపక్కకు ఒరిగాడు. కాలం 'లూసిక్' లా మూసుకపోయింది.

రాధ కళ్లెత్తి చూచింది. వెంకట్రావు పక్కనే కూర్చునివున్నాడు రెండు చేతులు వెంకట్రావు మెడకు పెనవేసి లేచి కూచుంది. 'రాధా' అన్నాడు వెంకట్రావు చెదరిపోయిన ముంగురులను సరిజేస్తూ. 'ఊ' అంది అతని కళ్ళల్లోకి చూస్తు.

"మళ్లా ఎప్పుడు......" అన్నాడు.

"రేపు ప్రైవేటుకురారూ..." అంది సిగ్గుపడ్తూ.

సరే వెళ్ళొస్తానన్నాడు. రాధ ఏమీ మాట్లాడలేదు.

అన్నంతిని పడుకున్నాడు. అతనేదీ ఆలోచించకుండానే నిద్రపట్టింది. ప్రొద్దున్నే లేచి కూర్చుని రవణమ్మకు తాను ఐదుగంటలకు వస్తానని తెలిసివుండిగూడ రాధను ఒంటిగా వదలిపెట్టి వెళ్లింది. కారణం? రాధ వయస్సులో చిన్నదైనా జాణతనం నేర్పింది? ఈ రోజు సాయంత్రమే వీటన్నిటికీ జవాబు లాగాలి అనుకున్నాడు.

"ఒరే వెంకూ ప్రైవేటుకు పోవూ' అన్నది మహలక్ష్మి.

'ఇదుగో పోతున్నానమ్మా' అన్నాడు. ప్రైవేటు ఎంతో ఉత్సాహంగా చెప్పి యింటికి వచ్చేశాడు. గడియారం ముందు కూర్చుని ఐదు ఎప్పుడవుతుందా అని ఎదురు చూడసాగాడు. మూడుగంటలనుండి డ్రెస్సుచేసుకుంటూ నాలుగున్నరకే బయల్దేరాడు. సన్నజాజి పందిరిదగ్గర రవణమ్మ కూర్చుని రాధతో మాట్లాడుతోంది. రవణమ్మనుచూచి ఆగిపోయాడు వెంకట్రావు.

"రా అబ్బాయ్. నిల్చున్నావేం" అంది. రాధ వెంకట్రావునుచూచి చిరునవ్వువిసరి తల వంచుకుంది

"ఏమబ్బాయ్! త్వరగా వచ్చావే? అమ్మాయి బాగా నేర్చుకుంటున్నదా?"

"ఆఁ ఆఁ" అన్నాడు.

"నువ్వు బాగాచెప్తావనిగూడా చెప్పిందిలే మారాధ"

వెంకట్రావుకు మతిపోతోంది. కొంపదీసి సంగతంతా చెప్పిందేమో నను కున్నాడు.

"రాధా, మూగమొద్దులా నిలబడక పోతే పోయి చదువుకోరాదూ. నేను భజనపార్టీకి వెళ్ళొస్తాను. అబ్బాయ్! చదువులో లోపముంటే నేను సహించను" అని గేటుతీసుకొని వెళ్లిపోయింది.

వెంకట్రావు వెనకాలే వెళ్లి గేటు మూసేశాడు. పక్కకు తిరిగి చూచేసరికి రాధలేదు. వెంటనే హాల్లోకి వెళ్లాడు. ఆ తలుపు మూసేసి మంచంవైపు చూచాడు. రాధ పడుకొనివుంది. దగ్గరకు వెళ్లి 'ఏయ్' అన్నాడు, చిన్నిపెదాలు సిగ్గుతో మరింత ముడుచుకపోయాయి. కళ్ళు తెరచి చూచింది. వెంకట్రావు నవ్వాడు. వెంటనే అతన్ని లాక్కుని రెండుచేతులతో కళ్లుమూసుకొంది రాధ.

ఓఅరగంట తర్వాత 'రాధా' అన్నాడు.

"ఊ" అంది.

"నిజం చెప్పవూ. నువ్వెవరివి?"

"అన్నీ తర్వాత చెప్తా ?"

"కాదు యిప్పుడే చెప్పాలి"

రాధ కళ్లుతెరచి చూచింది. అతని కళ్ళలో సంశయం కన్పిస్తూవుంది. 'నేనంటే మీకు యిష్టంలేదా'

"అదికాదు రాధా..."

"నేనంటే యిష్టంలేకపోతే..." రాధ కండ్లలో నీళ్ళునిండాయి.

"ఇక అడగనులేరాధా నీకంత కష్టంగావుంటే"

"సరే ఇక చదువుచెప్పండి. మళ్ళీ అమ్మ అడిగితే చెప్పాలిగా..." కళ్ళు తుడుచుకొని నవ్వింది.

"ఏం చెప్పమంటావు ?"

"ఇంగ్లీషు"

"ఏదీ పుస్తకం ఇలాతే. నిన్న యిచ్చిందిమాత్రం యివ్వొద్దు" అన్నాడు. రాధ అతన్నివదలి టేబులువద్ద నిలబడింది. 'రా రాధా' అన్నాడు.

"మీరే రండి" అంది రాధ.

వెంకట్రావు వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. రాధ అతని ఒళ్ళో కూచుంది. 'ఆ. అడగండి నాకు చిన్నపదాలకు స్పెల్లింగు తెలుసు.'

"ఐతే నువ్వే అడ[illegible] పెదాలకు అర్థం నాకు తెలియలేదు"

"అబ[illegible]ప్పుడుకాదవి. అడగండి."

"సరే [illegible] తప్పుచెప్తే"

"శిక్ష[illegible]"

"పిల్లలనైతే మొట్టికాయలు వెయ్యొచ్చు. మరి నీవు తప్పుచెప్పావంటే తప్పుకు ఒక ముద్దుయివ్వాలి. సరేనా?" అన్నాడు.

"సరే. నేను రైటుచెబితే మీరు నాకివ్వాలి" అంది.

* * *

ముప్పైరోజులు గడచిపోయాయి. వెంకట్రావు యితర ప్రైవేట్లు వదలుకున్నాడు. రాధకు ప్రైవేటు చెప్పడానికి ఆ [illegible]కి టైం చాలటంలేదు. మహలక్షమ్మకు అనుమానం తగలకుండా రాత్రి తొమ్మిందింటికే యింటికి చేయికుంటున్నాడు.

ఆ రోజు ఎప్పటిలాగే నాలుగున్నరకు రాధయింటికి వెళ్ళాడు. గేటు తలుపుకు తాళంవేసివుంది. ఆశ్చర్యపోతూ నిలబడ్డాడు. ఇంతలో ప్రక్కింటినుండి ఒకామె యువతలికివచ్చి 'మీరేనా వెంకట్రావు' అంది.

"అవునండీ. ఏం?" అన్నాడు ఆత్రుతతో.

"ఇదిగోనండి. మీరువస్తే ఇది యివ్వమని చెప్పారు రవణమ్మగారు" అని కవరొకటి చేతికిచ్చింది. కవరు అందుకుని వెనుతిరిగాడు. పెన్నానది చల్లగా మెల్లగా ప్రవహిస్తున్నది. ఇసుకలో చదరుగా కూర్చునివున్నారు కొందరు. వెంకట్రావు వాళ్ళకు దూరంగాపోయి కూలబడి కవరు చించాడు. ఒక వందరూపాయల నోటు, దాంతో పాటుఒకవుత్తరం. అందులో—

నారాజుకు,

నన్ను మీరు క్షమిస్తారని ఆశిస్తూ ఈ వుత్తరాన్ని వ్రాస్తున్నాను. నేను వెళ్లడానికి కారణం చెప్పేముందు నేనెవరినో మీకు తెలుపవలసివుంది ఒకనాడు మీరు నన్నడిగారు 'నువ్వెవరి' వని. చెప్తాను.

"నాకు తల్లిదండ్రు లెవరూ లేరు" అని రవణమ్మ చెప్పగా విన్నాను. నేను ఏకులందాన్నోగూడా నాకు తెలియదు. రవణమ్మకిగూడా తెలియదట. నాకు ఊహ వచ్చినప్పటినుంచీ ఆమెవద్దే పెరిగాను. రవణమ్మ పడుపువృత్తి చేస్తుండేది. నన్నుగూడ దాంట్లోకే దింపింది. నేను తప్పించుకోలేకపోయాను. బలహీనురాల్ని.

పదమూడేళ్ల వయస్సప్పుడే నేను బలవంతంగా యిందులోకి తోయబడ్డాను. ఆ వూరు యీ వూరుతిరిగి మీ వూరు వచ్చాము. రంగనాథంగారు నన్నుతెచ్చి ఆఇంట్లోవుంచారు. రెండ్రోజులకే బయటపడింది ఆయన బండారం. ఆయన తృతీయాప్రకృతి. నేనేమో అలవాటుపడినదాన్ని. నిగ్రహించుకోలేక పోయాను. అదే సమయంలో మిమ్ము[illegible]ను చూడటం తటస్థించింది. నాకేదో ఆవేశం కలిగినట్లయింది. రవణమ్మతో ఈ సంగతి చెప్పాను. ఆమె నాపట్ల దయగానేవుండేది. ఒప్పుకుంది. తత్ఫలితమే మీ స్నేహం. నా జీవితంలో మిమ్మల్ని మాత్రం మరిచిపోను.

చివరకు మన ఖర్మ బాగుండక ఎలాగో రంగనాథానికి మనసంగతి తెలిసింది. వెళ్లిపొమ్మన్నాడు మమ్మల్ని. ఇంతలో రవణమ్మకు మరెవరో తటస్థపడ్డారు. ఆయన నాకథంతా విన్నాడు. నలభైయేళ్లుంటా యతనికి. నన్ను పెళ్లీ చేసుకుంటానన్నాడు. నా గతంతో సంబంధంలేదన్నాడు. ఆయనతో వెళ్లుతున్నామిప్పుడు నేనుగూడ యికమీదట 'మంచి' గా బ్రతకాలని నిర్ణయించుకున్నాను.


మీరు దీంతోపంపిన వంద తీసుకోండి. రవణమ్మ మిమ్మల్ని అడిగినట్లు చెప్పమంది. మీరు త్వరలో పెళ్లిచేసుకొని నన్ను మర్చిపోవడానికి ప్రయత్నించండి. నాకోసం వెతకడానికి ప్రయత్నించకండి. దేవు డనుగ్రహిస్తే ఏనాడైనా మిమ్మల్ని చూస్తాను.

'రాధ'

ఉత్తరం మడిచివేసాడు వెంకట్రావు. ప్రైవేటు...వంద... ప్రైవేటు...మర్చిపోవాలిట. ఓహ్. మరుపు అనుకున్నాడు. చేతిలో కాగితాలు రెపరెపలాడుతున్నాయి. దూరాన ఎవరో పిల్లలు 'అదుగో మన ప్రైవేటుమాస్టారు' అంటున్నారు. వెంకట్రావు ప్రైవేటు... ప్రైవేటు అని గొణిగాడు.

★


## రూ. 5 లకు కెమెరా



చెయిన్ సిస్టమ్ అనే పద్ధతిలో మీరొక దిగుమతి చేయబడిన మడిచి వేయగల ఒక కెమెరాను పొందవచ్చును. 5 సంవత్సరముల గారంటీ కలది. ఖరీదు 5 రూపాయలు మాత్రమే. టపాఖర్చు రూ. 1-25 న. పై లు ప్రత్యేకం.

గమనిక:—ఈ పద్ధతిని మా హనిమూన్ సెంటును ప్రబలము చేయుటకే తెలిపియున్నాము. తృప్తినీయనిచో డబ్బు వాపసు యీయగలము.

ఇండియన్ చేంబర్ ఆఫ్ సైన్స్ (సి. జి. ఎం.), జలందర్ సిటీ.